# నిషా

అప్పుడే వంటపని పూర్తిచేసిన ఆమె, తడైన చేతులు తుడుచుకుంటూ బయటకువచ్చి, బజారు చివరకు చూపు సారించింది. ఆమె ఆ ఎర్రటి సిల్కుచీరెలో మరింత అందంగా ఉంది. తెల్లటి మల్లెలు ఆ నల్లటి కురులలో విప్పారి ఆ ప్రదేశాన్నంతా సువాసనతో నింపింది. ఆమె కాటుక దిద్దిన కళ్ళతో నిరీక్షిస్తుంది ... ఎవరి కోసం ? ... నిరీక్షణ నిస్పృహగా మారింది. లోపలకు బరువుగా అడుగులువేసింది.

'... రేపు సాయంత్రం అయిదు గంటల బండికి క్యాంపునుండి వచ్చేస్తున్నాను ...' అవి ఉదయం అందిన ఉత్తరంలోని చివరిమాటలు. అందుకోసమే ఆమె అంతగా ముస్తాబైంది. నిరీక్షిస్తోంది.

ఆరున్నరైనా ఇంకా రాలేదేమిటి ?

లేకపోతే ఏదైనా పనుండి ఆగిపోయారేమో !

బండి లేటయినా యింత సేపు కాదు.

'ఒకవేళ నేను ఉత్తరం చదవడం పొరపాటు చదివానేమో!' ఆలోచనకు అందిన సంశయాన్ని తీర్చుకోడానికి మళ్ళీ మళ్ళీ చదివింది, ఉత్తరంలోని ఆ చివరిమాటలు.

'నేను చదవడం పొరపాటు కాదు.'

ఒకవేళ నే నడిగిన చీరె దొరకక ఊరంతా తిరుగుతున్నారేమో ! దొరకక పోవడానికి ... అదేమంత గొప్పది కాదుగా?' అలా ఎన్నో ఆలోచనలు ఆమెలో సుడులుగా తిరిగాయి. తిరుగుతున్నాయి. కాని ... పరిష్కారం కాలేదు.

గడియారం ఏడు గంటలు కొట్టింది.

ఆమె విచారంగా, ఒంటరిగా కుర్చీలో కూర్చునే ఉంది.

మరో అరగంట ... ఆపైన ఐదు నిమిషాలు అలానే గడిచిపోయాయి. బయట తలుపు చప్పుడైంది. ఆమె మనస్సు ఉప్పొంగి ఉరకలు వేసింది. 'ఆయన వచ్చేశారు' అనుకుంటూ గబగబా వెళ్ళి తలుపు తీసింది.

అయనే ! ఆమె భర్త !

తడబడుతున్న అడుగులతో లోపలకు నడిచాడు అతడు. ఆమె ఎంతసంతోషంపొందిందో, అదంతా ఒక్కసారిగా విచారంలోకి మారింది. ఆ మార్పుకు సూచనగా ఆమె మనస్సు ఆవేదనతో మూల్గింది. కళ్ళు నీళ్ళతో నిండాయి. భయంతో వణికిపోయింది. మరొకవైపు

ఆశ్చర్యంగా ఆమె అతనిని చూసింది.

బయట బెడ్డింగ్, సూట్ కేస్ అలాగే ఉన్నాయి.

'ఏయ్! ... ఏమిటలా చూస్తున్నావ్?' అడిగాడు అతడు. నిషా సూచిన్నాయి ఆ మాటలు. మనిషి తూలుతున్నాడు.

ఆ పిలుపులోని మార్పు చూసి ఆమె మరింత ఆశ్చర్యపోయింది. 'ముద్దుగా పేరు పెట్టి పిలిచే ఆయనేనా, ఈరోజు ఇలా మాట్లాతుతున్నది. ఇంతకుముం దెన్నడూ ఆయన ఇలా పిలవలేదే!' అనుకున్నది.

'ఓహో!... సాయంత్రం వస్తానని చెప్పాను కదూ ... పొద్దున వచ్చానని ఆశ్చర్య పోతున్నావా?' అంటూ గడియారం చూసుకుని, 'ఇంకా ముందే వచ్చేద్దామనుకున్నాను... ఏం చెయ్యను... రైలు వెనక్కి నడుస్తూ ముందుకు వచ్చింది... అది సరేగాని ఏడున్నరైనా ఇంకా తెల్లవారలేదేమిటి...? అదిగాక ఇంకా బజార్లో లైట్లు వెలుగుతున్నాయి... మన కెందుకులే సామాను లోపల పెట్టు' అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

వచ్చేకన్నీటిని ఆపులేకపోయింది ఆమె.

'ఆయనేనా ఇలా మాట్లాడుతున్నది?'

'నేను కష్టపడుతుంటే చూడలేని ఆయనేనా ఈ మోయలేని బెడ్డింగ్ లోపల పెట్టమంటుంది. ఏమి టిదంతా! ... భగవంతుడా!'

అతని ప్రవర్తన చూసి ఆమె మనస్సు మరింత బెదరిపోయింది.

ఆ నలిగిన గుడ్డలు ... చెదరిన జుట్టు, ఎర్రబడిన కళ్ళు... మూసుకు పోతున్న కను రెప్పలు ... చూచినప్పుడు ఆమె గుండె ఆగిపోయినంత పనైంది. ఏమీ మాట్లాడలేక పోయింది.

'ఆయన తాగారు'

'ఛీ! ఆయన అటువంటి పని




ద్వితీయ బహుమతి

రూ. 25

పసుపులేటి సాంబశివరావు

బి. యస్ సి. ఫైనల్

వి. యస్. ఆర్. కాలేజీ,

తెనాలి

చెయ్యరు' తనకుతాను సమర్థించు కొన్నది. కాని ... ఎదురుగా తను చూస్తున్న దృశ్యాన్ని నమ్మకుండా ఉండలేకపోయింది.

ఏవో పిచ్చిపిచ్చి పాటలు పాడు తున్నాడు అతడు.

'ఏయ్! ఏడుస్తున్నావ్ దేనికి? ... గంటైంది వచ్చి ... కాఫీ ఇవ్వాలని తెలియదూ? ...' అంటూ లేచి కోపంగా కుర్చీని ఒక తన్ను తన్ని దానితోపాటు తానుకూడాపడ్డాడు.

ఆమె అతనిని పడక గదిలోకి తీసుకువెళ్ళింది. గభాలున వెళ్ళి మంచంమీద పడ్డాడు అతడు.

'ఇలా వచ్చి కూర్చో' అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

'ఇలారా! ...' అంటూ పెద్దగా అరిచాడు,

భయంగా వెళ్ళి మంచంమీద కూర్చుంది.

'చూశావా! ... నేను తాగాను.'

'మీరా ?!'

'ఆవును నేనే ... ఇందాక బజారులో ఒక స్నేహితుడు నువ్వు ... నువ్వేరోయ్ ... అన్నాడు ... వాడూ తాగాడులే ... వాడిమీద నమ్మకం లేక నిన్ను అడుగుతున్నా! ... నేను తాగానుకదూ !'

'అవును ... మీరుతాగారు' ఆమె అతడిని అపి, అన్నది.

నిషాలో అతడు ఏవేవో మాట్లాడుతున్నాడు. నిషాలో అతని కళ్లు మూసుకుపోతున్నాయి.

ఆమె తలవంచుకుని, కొంగులో తలదూర్చి, వచ్చే ఏడ్పును ఆపుకోలేక, పెద్దగా ఏడ్చింది.

ఆమె చేతులు పట్టుకొని, పైకి తలెత్తి 'ఏడుస్తున్నావా ? ఛీ ! ఊర్కో !' అంటూ దగ్గరకు తీసుకున్నాడు. ఆమె ఆశ్చర్యపోయింది.

'పిచ్చిదానా ! ఎందుకలా ఏడుస్తావ్ ? నిన్ను తమాషాకి అలా ఆడించానుగాని ... నేను నిజంగా తాగలేదు ... అది తెచ్చి పెట్టుకున్న నిషా'

'నిజంగా !' అతని ముఖంలోకి చూచి, ఆమె అడిగింది.

'నిజం' అంటూ ఆమెను అతడు హృదయానికి హత్తుకున్నాడు. ఆమె కంటినుండి వెలువడిన అశ్రువులు ... ఆనందాశ్రువులుగా మారాయి.

● ● ●

ఆ సంఘటన జరిగి రెండేళ్ళయింది.

అతడు ఆనాడు నిజంగా త్రాగలేదు ... కావాలని నిషాను నటించాడు ... ఆమెను ఆడించాడు.

ఇప్పుడది రెండు రోజులనుంచి జరుగుతున్న నిజం.

అతడు నిజంగా త్రాగుతున్నాడు ... వద్దన్నా నిషా అతన్ని వరిస్తోంది ... కాని ... ఆడించడానికి ఆమెలేదు ... ఆమె ఫొటో మాత్రం గోడకు వ్రేలాడుతూ అతనినే చూస్తోంది ... ఆమె వెళ్ళిన లోకం నుంచి మరెన్నటికి రాలేదు. రాదు.

□□□